# గిరి సమస్యలు పట్టవా..?


మూడేళ్ల క్రితం కొట్టుకుపోయిన పస్పుల వంతెన

- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఆదివాసీలు
- వానాకాలంలో ఉప్పొంగుతున్న వాగులు
- వంతెన నిర్మాణం చేపట్టని అధికారులు
- రోడ్లపైనే ప్రసవాలు జరుగుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న ఖానాపూర్, పెంబి మండలాల ప్రజలు

**ఖానాపూర్:** నియోజకవర్గంలోని ఖానాపూర్, పెంబి మండలాల గిరిజన గ్రామాల అభివృద్ధిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్లుగా ఆయా గ్రామస్తుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. నేటికీ కనీసం రవాణా సౌకర్యం లేని గ్రామాలు నియోజకవర్గంలో ఎన్నో ఉన్నాయి. నియోజకవర్గంలోనే ఐటీడీఏ ఉన్నా తమను పట్టించుకునే వారు కరువయ్యారని, దశాబ్దాల కాలంగా ఉన్న వంతెనల సమస్య తీర్చడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకులు ఎన్నికలు ముగిశాక తమవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్య వచ్చినా నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

**ఏళ్లుగా సమస్యలే..**

పెంబి మండలంలో యాపల్‌గూడ, రామ్‌నగర్, సత్తుగూడ, వస్‌పల్లి, దోందరి, చాకిరేవు, అర్పనతండా, తులసిపేట్, గుమ్మెన ఎంగ్లాపూర్, పస్పుల, దయ్యామద్ది తదితర గ్రామాలున్నాయి. వానాకాలంలో ఆయా గ్రామాలకు మండల కేంద్రం


దొత్తివాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)

నుంచి మూడు కిలోమీటర్ల దూరం వెళ్తే మధ్యలో కడెం, దొత్తి వాగులు దాటాల్సి ఉంటుంది. పెంబి నుంచి వాగుల వరకు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి అక్కడి నుంచి కాలినడకన వాగులు దాటాల్సిన పరిస్థితి వారిది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అంకెన, రాయదారి, పోచంపల్లి, గోదుమాల పైన, గోదుమాల కింద, కర్జంలొద్ది తదితర గ్రామాల వారు సైతం మండల కేంద్రానికి చేరాలంటే కడెం వాగుదాటి రావాల్సి ఉంటుంది. ఖానాపూర్ పట్టణం మీదుగా మరో మార్గం ఉన్నా సుమారు 80 కిలోమీటర్లకు పైగా దూరభారం అవుతోంది. ఖానాపూర్ మండలం కోలాంగూడ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ గ్రామానికి వెళ్లాలన్న బల్లివాగు దాటాల్సిన పరిస్థితి ఉంది. ఆయా గ్రామాలకు రహదారులు కూడా సరిగా లేకపోవడంతో 108 అంబులెన్స్‌లు కూడా వెళ్లక అత్యవసర సమయాల్లో రోగులకు తిప్పలు తప్పడం లేదు.

**కొట్టుకుపోయిన వంతెన..**

పెంబి మండలం పస్పుల, అర్పనతండా, తులసిపేట్, దయ్యాలమది, అంకెన, రాయదారి తదితర గ్రామాలకు వెళ్లే దారి మధ్యలో ఉన్న కడెం వాగుపై గతంలో వంతెన ఉండేది. కాగా రెండేళ్ల క్రితం వచ్చిన భారీ వరదలతో వాగుపై నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. అయినా నేటికీ వంతెన పనులు, తాత్కాలిక రోడ్డు పనులు కూడా చేపట్టలేదు. పలు గ్రామాలకు రహదారులతో పాటు దశాబ్దాల కాలంగా విద్యుత్ సౌకర్యం లేక నానా ఇక్కట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతీ గిరిజన గ్రామం నుంచి మండల కేంద్రం వరకు బీటీ రోడ్డు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని తెలుపడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు.

**గతంలో జరిగిన పలు సంఘటనలు..**

- గతంలో పెంబి మండలం యాపల్‌గూడ నుంచి పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీని ఆసుపత్రికి తరలించే క్రమంలో వాగు దాటించలేక అక్కడికే వైద్యుడు వెళ్లి ప్రసవం చేయాల్సి వచ్చింది.
- యాపల్‌గూడ పరిధిలోని పలువురు వాగు దాటుతూ గల్లంతైన సంఘటనలు సైతం ఉన్నాయి.
- ఆరేళ్ల క్రితం వానాకాలంలో ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామంలోని గ్రామసభకు వచ్చి తిరిగి వెళ్తుండగా కుసుంపూర్‌కు చెందిన గిరిజన యువకుడు వాగు దాటుతూ గల్లంతయ్యాడు.
- 2014 సర్పంచ్ ఎన్నికల సమయంలో పెంబి మండలం గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు మధ్యలోని దొత్తివాగుతో పాటు ఒర్రెలు పొంగిపొర్లడంతో అధికారులు 10 రోజుల వరకు ఎన్నికలు వాయిదా వేశారు.
- ఫిబ్రవరి, 2023లో దోందరి పంచాయతీ పరిధి వస్‌పల్లి గ్రామానికి చెందిన సీడాం సరిత అనే మహిళ రోడ్డు సక్రమంగా లేక ఆసుపత్రికి తరలించే క్రమంలో జాప్యం జరిగి రోడ్డుపైనే ప్రసవించింది.
- ఆగస్టు 24, 2023లో పెంబి మండలం తులసిపేట్ గ్రామానికి చెందిన గంగమణి అనే గర్భిణీ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో వాగు దాటలేక రోడ్డుపై ప్రసవించింది.

# ‘విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట’


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**దస్తురాబాద్:** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని భూత్కూర్, ఎర్రగుంట, గోడిసీర్యాల, గోండుగూడ, బుట్టాపూర్, మల్లాపూర్ గ్రామాలలో పర్యటించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 10 లక్షల వ్యయంతో క్రీడా మైదానాన్ని చదును చేయడానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం చేశారు. గోడిసీర్యాల, గోండుగూడ, మల్లాపూర్ గ్రామాలలో వర్షాలతో కూలిన ఇళ్లను పరిశీలించారు. భారీ వర్షాలతో కూలిన ఇళ్లను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కటిస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా పోషణమాసం కార్యక్రమాలు

**సారంగపూర్:** మండలంలోని జామ్, యాకర్‌పెల్లి, ఆలూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణమాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం వండిపెట్టారు. అనంతరం వారి బరువు, ఎత్తు, వయస్సు, తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సరోజ, వసంత, స్వరూప, ఏఎన్‌ఎం శాలిని, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, కవిత ఉన్నారు.

**తానూరు:** చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు, పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. బుధవారం మండలంలోని హిప్నెల్లి గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీలో వివిధ పనుల నిమిత్తం ఖర్చుచేసిన నిధుల వివరాలను తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి దత్తరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**దస్తురాబాద్:** గర్భిణులు పౌష్టికర ఆహారం తీసుకోవాలని పీహెచ్‌సీవైద్యుడు విజయ్ కుమార్ సూచించారు. మున్యాల గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహించారు.

# గర్భిణులు హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలి

**సోన్:** జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో న్యూవెల్మల్ బొప్పారం పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం హెచ్ఐవీ పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రధానోధ్యాయుడు విద్యాసాగర్‌లు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది నిర్మల, రమేశ్, సరిత, అనిత, రాజేశ్వర్, శిరీష, లక్ష్మీ, ఉపాధ్యాయులు సాయి రెడ్డి, ముత్తన్న, ప్రభకుమారి, గంగాధర్ పాల్గొన్నారు.

# అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం


నివాళులర్పిస్తున్న సిబ్బంది

**ఖానాపూర్:** పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలప స్మగ్లర్ల చేతిలో మృతిచెందిన ఎఫ్‌బీవో టి. సత్యనారాయణతో పాటు అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అధికారుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవడంతో పాటు అటవీ అధికారులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్, అటవీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## క్లుప్తంగా

### ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

**నిర్మల్‌టౌన్:** హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్‌పై చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని రజక సంఘం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జరాం కోరారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు.

### కూలిన ఇల్లు

**ఖానాపూర్:** పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మంగళవారం రాత్రి నీరటి రాజవ్వ అనే వృద్ధురాలికి చెందిన ఇల్లు కూలిపోయింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పూర్తిగా తడిసిపోయి రాత్రి ఒక్కసారిగా నేలమట్టమైంది. ఇల్లు కూలిన సమయంలో వృద్ధురాలు ఆరుబయట ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇంట్లో సామగ్రి ధ్వంసమైందని, బాధితురాలికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఖానాపూర్:** పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల మహాత్మా జ్యోతిబాపూలే ఇంటర్ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ తెలిపారు. బైపీసీలో 20 సీట్లు, సీఈసీలో 16 సీట్లు, ఎంపీసీలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జిరాక్స్ సెట్‌లతో ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### ఆర్థికసాయం

**లక్ష్మణచాంద:** మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన గద్దె అరుణ్‌కు రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా గ్రామస్తులు ఆర్థిక సాయం చేశారు. విరాళాలు సేకరించి రూ.55,400లు బుధవారం అందజేశారు.

### బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

**కడెం:** బ్యాంకు రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ హబ్ మేనేజర్ శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెద్దూర్ మేనేజర్ నరేశ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బ్యాంక్ రుణాల రోడ్‌షో కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ రకాల రుణాలపై అవగాహన కల్పించారు.

### డైనింగ్‌హాల్ ప్రారంభం

**లోకేశ్వరం:** మండలంలోని బామ్ని కే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాత డాక్టర్ దేవెందర్‌రెడ్డి రూ.60 వేల సొంత నిధులతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి వైద్యవృత్తిని చేపట్టానన్నారు. మండల విద్యాధికారి చంద్రకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బర్ల చిన్నయ్య, పీఆర్టీయూ నాయకులు రమణారావు, సురేశ్‌రావు, రాజారాం, రాజేందర్, నాయకులు శ్యాంసుందర్, జీవన్, రత్నకర్‌రావు ఉన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నిర్మల్‌చైన్‌గేట్:** 11కేవీ ఫస్ట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్, పాత అశోక్ థియేటర్, రాయల్ బిల్డింగ్ ఏరియా, చింతకుంటవాడ, పింజరి గుట్ట, బస్టాండ్ ప్రాంతాలలో ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

### ఎల్పీజీ గ్యాస్ బాండ్ పేపర్లు అందజేత

**నర్సాపూర్(జి):** మహాలక్ష్మి పథకం ద్వారా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల బాండ్ పేపర్లను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో తిరుపతి రెడ్డి అందజేశారు. మండలంలో 3615 మంది లబ్ధిదారులకు రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శులు త్వరలో పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

### శాస్త్రపరిజ్ఞానం రైతులకు తోడవ్వాలి

**కుంటాల:** ఉద్యోగుల శాస్త్ర పరిజ్ఞానం రైతులకు తోడవ్వాలని డీఏవో అంజి ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సూర్యాపూర్ ఏఈవోగా పనిచేస్తున్న పవన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్మెంట్ కళాశాల నుంచి వ్యవసాయ విస్తరణ విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా కోర్సును పూర్తి చేశారు. కాగా బుధవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏఈవో పవన్‌కు డీఏవో ధ్రువీకరణ పత్రం అందజేశారు.

### తనిఖీ

**ఖానాపూర్:** మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీవో రత్నాకర్‌రావు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రిజ్వానా సమక్షంలో రికార్డులు పరిశీలించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు.

## సంక్షిప్త వార్తలు

**రోడ్డుకు మరమ్మతులు**

**లక్ష్మణచాంద:** మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కనకాపూర్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో చామన్‌పల్లి నుంచి తిర్పెల్లి వెళ్లే రహదారి మధ్యలో గల వాగు వంతెనపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్తులతో పాటు పంటపొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చాలని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం గ్రామ వీడీసీ సభ్యులే స్వయంగా మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలలో సిమెంటు, కంకర, ఇసుకను కలిపి వేసి పూడ్చారు.

**కేజీబీవీ ఎస్‌వో బాధ్యతల స్వీకరణ**

**నర్సాపూర్ (జి):** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నూతన ఎస్‌వోగా వీణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెంబి మండలం మందపల్లి కేజీబీవీ ఎస్‌వోగా పనిచేశారు.

**శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి**

**సారంగపూర్:** గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని అలూరు గ్రామంలో బుధవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు.

**కడెం:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలోని గణేశ్ మండపాలను సందర్శించి, నిర్వాహకులకు సూచనలు చేశారు.

**కోలూరు గ్రామం సందర్శన**

**తానూరు:** మండలంలోని కోలూరు గ్రామాన్ని బుధవారం భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సందర్శించారు. గ్రామంలో కొనసాగుతున్న నిమజ్జనం ఉత్సవర్యాలీని పరిశీలించారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు ఏఎస్పీని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవ ర్యాలీలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

**‘దళితుల భూములు కాపాడండి’**

**సోన్:** దళితుల భూములు కాపాడాలని మండలంలోని కద్తాల్ గ్రామానికి చెందిన బర్మా రాజనర్సయ్య ఆధ్వర్యంలో దళితులు బుధవారం తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కద్తాల్, సాకెర గ్రామాలలో గల దాదాపు 70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1998లో దళితులకు కేటాయించారు. మూడేళ్ల క్రితం నిర్మల్ జిల్లా నటరాజ్‌నగర్‌కు చెందిన తక్కరి సత్యనారాయణ దళితులకు మాయమాటలు చెప్పి భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే ప్లాట్‌లు చేసి ఇతర ప్రాంత వాసులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడని వారు తెలిపారు. సరస్వతి కాలువకు ఆనుకొని ఉన్న భూములను కూడా స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. చట్టపరమైన చర్యలు తీసుకొని తిరిగి భూములను అప్పగించాలని కోరారు.

**బీజేపీ సభ్యత్వ నమోదు**

**లక్ష్మణచాంద:** మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాచాపూర్, పార్‌పెల్లి గ్రామాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కమల్ నయన్ పాల్గొన్నారు. మండల కన్వీనర్ అడ్వాల రమేశ్, మండల అధ్యక్షుడు గోవర్ధన్, చంద్ర మనోహర్ రెడ్డి, రంజిత్, చిన్నయ్య, పోశెట్టి, హరీశ్, పాల్గొన్నారు.

**సోన్:** న్యూవెల్మల్ గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు.

**పీఆర్‌టీయూ మండల కార్యవర్గం**

**బాసర:** మండల పీఆర్‌టీయూ టీఎస్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మమ్మాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డి. రమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై.లావణ్య, అసోసియేట్ అధ్యక్షులుగా కౌసర్ అహ్మద్, కార్యదర్శిగా బిల్లోల శ్రీధర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**తానూరు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల పీఆర్‌టీయూ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పండరి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, గౌరవ అధ్యక్షుడిగా సుదర్శన్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్వరూపారాణి, కార్యదర్శిగా మహమ్మద్ ఫాసిల్‌లను ఎన్నుకున్నారు.

**అటవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

**ఖానాపూర్:** అటవీ శాఖలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మన్నె రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది గంగారావు, నవదీప్, దశరథ్ తదితరులు ఉన్నారు.

**పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

**ఖానాపూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికుల 5 నెలల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి విజయ, నాయకులు రాజమణి, మంగ, లింబవ్వ తదితరులు ఉన్నారు.

**దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన**

**ఖానాపూర్:** పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

**తైబజార్ వేలం తేదీ మార్పు**

**ఖానాపూర్:** పట్టణంలో దినసరి, వారసంత నిర్వహణ కోసం చేపట్టే తైబజార్‌కు ఈ నెల 10వ తేదీన వేలం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ డిపాజిట్‌లు రాకపోవడంతో ఈ నెల 13వ తేదీకి మార్చినట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 12వ తేదీన కార్యాలయం పని వేళల్లో రూ.లక్ష డీడీ అందజేయాలన్నారు.

**నాటక ప్రదర్శన**

**ముధోల్:** మండలంలోని ఆష్టా గ్రామంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా మంగళవారం సీత సంహారం అనే నాటికను ప్రదర్శించారు. గంగాధర్ ఆధ్వర్యంలో పలువురు నాటికను ప్రదర్శించారు.

**సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం**

**ఖానాపూర్:** మహిళ వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరును పెట్టడం, ఐలమ్మ మనుమరాలు శ్వేతకు మహిళ కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు రజక సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


కుంటాలలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు

## ఘనంగా వినాయక నిమజ్జనం


తానూరులో..

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. అనంతరం సమీపంలోని చెరువులు, వాగులు, బావుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- కుంటాల/ ముధోల్/భైంసాటౌన్/ తానూరు/ భైంసారూరల్/సోన్


ముధోల్: నృత్యం చేస్తున్న మహిళలు


భైంసాటౌన్: ఆశ్రమ పాఠశాలలో..


భైంసారూరల్: నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

# కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు


ఖానాపూర్: గోసంపల్లి మండపంలో 51 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

**ఖానాపూర్:** పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఐదోరోజు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్న సంతార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో జరిగిన ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్, నాయకులు పాల్గొన్నారు. కాగా శ్రీరాంనగర్ కాలనీలో గల జెండా గల్లీలో నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలోని వినాయకుని శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

**నిర్మల్‌టౌన్:** నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో కొలువుదీరిన మట్టి గణపయ్యకు వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**లక్ష్మణచాంద:** మండలంలోని అన్ని గ్రామాలలో వినాయకుడు పూజలందుకుంటున్నాడు. బుధవారం 5వ రోజు మండలంలోని అన్ని గ్రామాలలో వినాయకుడి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**కుంటాల:** కుంటాలలోని రైతులు గత 16 ఏళ్లుగా వినాయకుడు, రైతు ఉన్న ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈసారి రైతు గణపతికి రొట్టెను అందిస్తూ, పంట పొలంలో మంచె, మంచె కింద ఎడ్లు సేద తీరుతున్నట్లుగా ఉన్న గణపతిని ప్రతిష్ఠించారు. గణపయ్యను చూసేందుకు భక్తులు తరలివచ్చారు.

**తానూరు:** మండలంలోని భోసి గ్రామంలో నెలకొల్పిన కర్ర గణేశుడికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేస్తున్నారు. బుధవారం జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, సరిహద్దు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదిలాబాద్ తుడుందెబ్బ నాయకులు ఆలయంలో పూజలు నిర్వహించారు.

**41 రకాల నైవేద్యాలు**

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ద్వారకనగర్ కాలనీలో కొలువుదీరిన గణపయ్యకు బుధవారం భక్తులు 41 రకాల నైవేద్యాలు సమర్పించారు.

**ఖానాపూర్:** పట్టణంలోని వినాయకుల వద్ద బుధవారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలోని మండపంలో కుంకుమపూజ నిర్వహించారు. గోసంపల్లెలో 51 రకాల నైవేద్యాలు సమర్పించారు. మస్కాపూర్ గ్రామంలో 21 రకాల నైవేద్యాలు సమర్పించారు.

### డీ16 కాలువ తూముకు గండి



**లక్ష్మణచాంద:** మండలంలో కురిసిన భారీ వర్షాలకు పొట్టపెల్లి కే గ్రామ సమీపంలో డీ 16 కాలువ తూముకు గండి పడింది. పొట్టపెల్లి కే, లక్ష్మణచాంద గ్రామాల రైతులు కాలువ గట్టుపై నుంచి వెళ్లే సమయంలో ఏ మాత్రం ఆదమరిచిన అందులో పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే పూడ్చకుంటే గండి పెద్దగా మారి నీళ్లు కింద ఉన్న పంట పొలాల్లోకి వెళ్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.